

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | ఆదివారం 31-1-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 155 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# అసెంబ్లీ ఆవరణలో మహాత్ముడి విగ్రహం వద్ద నివాళి

## రెండు నిమిషాలు మౌనం పాటించిన ఉద్యోగులు

హైదరాబాద్,జనవరి30(ఆర్ఎన్ఎ): తెలంగాణ అసెంబ్లీ ఆవరణలోని



మహాత్మాగాంధీ విగ్రహానికి స్పీకర్ పోచారం, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మహ్మాతుడి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించిన వారిలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, బోడకుంటి వెంకటేశ్వర్లు, నేతి విద్యాసాగర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ఉన్నారు. ఈ సందర్భంగా గాంధీ సేవలను స్మరించుకున్నారు. గాంధీ త్యాగనిరతి కారణంగానే ఇవళా స్వాంత్రం పొంది స్వేఛ్చా వాయువులు పీలుస్తున్నామని స్పీకర్ పోచారం అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉదయం 11 గంటలకు తప్పనిసరిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని కేంద్ర హోంశాఖ రాష్ట్రాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో దేశ ప్రజలందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. బిఆర్కె భవన్ వద్ద సచివాలయ ఉద్యోగులు రెండు నిముషాలు మౌనం పాటించారు. హైదరాబాద్ ముసారాంబాగ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద, సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ వద్ద పోలీసులు, వాహనదారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల సేవలకు గుర్తుగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

# జాతిపితకు ఘనంగా నివాళి

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతి ఆయనకు ఘనంగా నివాళి అర్పించింది. జాతిపిత వర్ధంతి వేడుకలు దేశవ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఆయన సమాధి రాజ్‌ఘాట్ వద్ద ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు మహాత్మునికి అంజలి ఘటించారు. గాంధీ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. దీనికి ముందు ప్రధాని మోదీ తన ట్విట్టర్ అకౌంట్‌లో బాపూజీని గుర్తుచేసుకుంటూ... మహాత్ముని వర్ధంతి రోజున ఆయనను గుర్తుచేసుకోవడం, ఆయన ఆలోచనలను పంచుకోవడం అందరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. భారత స్వాతంత్య్ర సంగ్రామంలో పాల్గొని, తమ ప్రాణాలను అర్పించిన అమర వీరులను గుర్తు చేసుకోవడం అవసరమన్నారు. తెలంగాణలోనూ గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపుఘాట్ వద్ద గాంధీ విగ్రహానికి పలువురు పూలమాల వేసి





నివాలులర్పించారు. నగరంలోని బాపు ఘాట్ వద్ద జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహాత్ముడి విగ్రహాం వద్ద గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మహాత్ముడికి నివాళులర్పించిన వారిలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ శ్వేతా మహంతి, హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్‌తో పాటు పలువురు నివాళులర్పించారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వీరంతా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. జాతిపిత మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్య్రం తెచ్చి పెట్టడమే కాకుండా.. ప్రపంచానికే శాంతిదూతగా నిలిచారని తెలంగాణ శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు.

**రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పించిన రాష్ట్రపతి, ప్రధాని**

**బాపూఘాట్ వద్ద నివాళి అర్పించిన గవర్నర్, మంత్రులు**

# ఎంబసీ వద్ద పేలుళ్లు తమపనే

## జైష్ ఉల్ హింద్ అనే ఉగ్రవాద సంస్థ ప్రకటన

## సిసి పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించే పని

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని నగరంలోని ఇజ్రాయెలీ దౌత్య కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన పేలుళ్ళు తమ పనే అని జైష్ ఉల్ హింద్ అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఓ టెలిగ్రామ్ చాట్‌లో ఈ విషయాన్ని గుర్తించాయి. ఓ అనుమానిత చానల్‌లో ఈ ఉగ్రవాద సంస్థ పేర్కొన్న ఈ వివరాలను గుర్తించాయి. ఈ పేలుడు తమకు గర్వకారణమని ఈ సంస్థ ప్రకటించినట్లు గమనించాయి. ఈ సంస్థ గురించి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి. ఢిల్లీలోని ఇజ్రాయెలీ ఎంబసీ వద్ద శుక్రవారం జరిగిన మైనర్ ఐఈడీ బ్లాస్ట్ ఉగ్రవాద చర్యేనని ఇజ్రాయెల్ పేర్కొన్న సంగతి తెలిసిందే. దేశంలోని అత్యంత కీలక ప్రాంతాలను పరిరక్షించే బాధ్యతలను నిర్వహిస్తున్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) దేశవ్యాప్తంగా ఉన్న తన యూనిట్లను అప్రమత్తం చేసింది. విమానాశ్రయాలు, కీలక న్యూక్లియర్ ఇన్‌స్టలేషన్స్, మెట్రో స్టేషన్లు, కేంద్ర ప్రభుత్వ భవనాల వద్ద భద్రతకు సీఐఎస్ఎఫ్‌ను నియోగిస్తారన్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా, ఈ కేసు దర్యాప్తులో భారతీయ సంస్థలకు సహకరించేందుకు త్వరలోనే ఇజ్రాయెలీ దర్యాప్తు బృందం రాబోతోంది. ఈ పేలుడుకు ఉపయోగించిన క్రూడ్ ఐఈడీలో బ్యాటరీ ఉన్నట్లు దర్యాప్తు అధికారులు నిర్థరించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పేలుడు జరిగిన వెంటనే బ్యాటరీ ముక్కలైందని, ఈ ముక్కల కోసం అన్వేషణ జరుగుతోందని తెలిపాయి.

ఈ బాంబును నేలపైనే పెట్టారని, అందుకే పెద్ద గొయ్యి ఏర్పడిందని నిర్థరించినట్లు కూడా తెలిపాయి.

భారత దేశంలోని ఇజ్రాయెల్ రాయబారి రోన్ మల్కా ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెలీ దౌత్య కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఢిల్లీ పేలుళు ఆశ్చర్యకరం కాదని తెలిపారు. భారత దేశంతో ఇజ్రాయెల్ నిఘా సమాచారాన్ని పంచుకుంటున్నట్లు తెలిపారు.

మరోవైపు ఢిల్లీ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఓ క్యాబ్‌లో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇజ్రాయెలీ ఎంబసీవైపు నడుచుకుంటూ వెళ్ళారని గమనించారు. ఈ వాహనం డ్రైవర్ ఆచూకీ తెలిసిందని, ఆ వాహనం నుంచి దిగిన వ్యక్తుల చిత్రాలను రూపొందిస్తున్నారని సమాచారం.

# సరిహద్దుల్లో కొనసాగుతున్న ఉద్రిక్తత

## ఢిల్లీని వీడేందుకు కదలని రైతులు

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ):ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులు సరిహద్దుల్లో తమ నిరసనలు కొనసాగిస్తున్నారు. పోలీసులు బోర్డర్ ఖాళీ చేయమన్నా పట్టు వీడటం లేదు రైతులు. ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి వెళ్లబోమంటూ ఆందోళనలు చేస్తున్నారు. మరోవైపు నిన్నటి నుంచి ఆందోళనలకు యూపీ, హరియాణా రైతులనుంచి మద్దతు పెరుగు తోంది. వేలాదిగా తరలివస్తోన్న రైతులు సింఘు, టిక్రీ, ఘాజీపూర్ బోర్డర్‌లకు చేరుకుంటున్నారు. దీంతో ఘాజీపూర్ బోర్డర్‌లో ట్రాక్టర్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సింఘు బోర్డర్లో స్థానికులు, రైతుల మధ్య జరిగిన ఘర్షణ కారణంగా ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే ఆందోళన నెలకొంది. ఓ వైపు రైతులు ఖాళీ చేయమని పట్టుబడుతుంటే.. స్థానికులు కూడా ఆందోళనలకు దిగుతున్నారు. వెంటనే సరిహద్దులు ఖాళీ చేసి వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని సరిహద్దుల్లో పోలీసులు భారీగా మోహరించారు.

# రైతులతో మరోమారు చర్చించడానికి సిద్దమే

**చర్చలకు కేంద్రం ఎప్పుడూ సిద్దంగానే ఉంది**

**రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం**

**బడ్జెట్‌లో రైతులకు వరాలు ప్రకటిస్తాం**

**రైతులకు ఫోన్ కాల్ దూరంలో ఉన్నాం**

**ఏడాదిన్నరపాటు సాగుచట్టాల అమలు నిలిపివేస్తాం**

**పార్లమెంట్ సమావేశాలను విపక్షాలు సద్వినియోగం చేసుకోవాలి**

**అఖిలపక్షభేటీలో ప్రధాని మోదీ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ): రైతులతో మరోసారి చర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో విపక్షాలు సాగు చట్టాల అంశాన్ని ప్రస్తావించాయి. చర్చలతోనే సమస్యలను పరిష్కరించాలని కోరాయి. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. 'రైతులతో మాట్లాడడానికి కేంద్రం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. రైతులకు కేంద్రం ఇచ్చిన ఆఫర్ ఇప్పటికీ వర్తిస్తుంది. ఏడాదిపాటు కొత్తసాగు చట్టాల అమలు నిలిపివేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతుల అభ్యంతరాలను పరిశీలిస్తాం. రైతుల సమస్యలకు చర్చలతోనే పరిష్కారం లభిస్తుంది. రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. బడ్జెట్‌లో రైతులకు వరాలు ప్రకటిస్తాం. పార్లమెంట్ సమావేశాలను విపక్షాలు సద్వినియోగం చేసుకోవాలని, అన్ని అంశాలపై పార్లమెంట్‌లో చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవచ్చని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. గతంలో తాము సూచించిన ప్రతిపాదనలకు ఇంకా కట్టుబడే ఉన్నామని, ఈ విషయాన్ని తమ సహచరులకు చెప్పాలని మోదీ అఖిలపక్ష నేతలతో వ్యాఖ్యానించారు. చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవచ్చు. మనమందరమూ దేశం గురించి ఆలోచించాలని మోదీ అఖిలపక్ష నేతలతో వ్యాఖ్యానించారు. కేంద్ర వ్యవసాయం మంత్రి తోమర్ అన్న వ్యాఖ్యలనే నేను పునరుద్ఘాటిస్తున్నా. మనం ఏకాభిప్రాయానికి రాలేకపోయాం. మేము ఓ ప్రతిపాదన పెడుతున్నాం. ప్రస్తుతానికి వీరు వెళ్లండి. మీ రైతులతో చర్చించండి. వారేమన్నారో మాకు ఓ ఫోన్ చేయండి. సరిపోతుందన్న తోమర్ వ్యాఖ్యలను ప్రధాని మోదీ మరోసారి పునరుద్ఘాటించారు. ఈ విషయంపై తాము ఎలాంటి అరమరికల్లేకుండా ఉన్నామని మోదీ స్పష్టం చేశారు. వివాదాస్పదమైన మూడు కొత్త సాగు చట్టాలను 18 నెలల పాటు సస్పెండ్ చేసే అంశం ఇంకా సజీవంగానే ఉన్నట్లు మోదీ వెల్లడించారు. అన్ని అంశాలపై రైతులతో చర్చించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. కొత్త సాగు చట్టాలను 18 నెలల పాటు తాత్కాలికంగా రద్దు చేయడానికి అంగీకరించడం లేదని, ఆ చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇవాళ అఖిలపక్ష సమావేశంలో ప్రధాని మాట్లాడిన అంశాలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆ తర్వాత మీడియాతో వెల్లడించారు. వ్యవసాయ చట్టాలను ఏడాదిన్నరపాటు నిలిపివేసే ప్రతిపాదనకు ఇప్పటికీ కేంద్రం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నట్లుగా వెల్లడించారు. కేంద్రం రైతుల సమస్యను పెద్ద మనసుతో పరిశీలిస్తోందని ప్రధాని అఖిల పక్ష సమావేశంలో హామీ ఇచ్చారు. జనవరి 22న వ్యవసాయ శాఖ మంత్రి చేసిన ప్రతిపాదనకు కేంద్రం ఇప్పటికీ కట్టుబడి ఉంది. తోమర్ జీ మీతో చర్చించడానికి ఫోన్ కాల్ దూరంలో ఉంటారనే విషయాన్ని ఈ సమావేశంలో ప్రధాని మరోసారి గుర్తుచేశారని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ట్వీట్ చేశారు. రైతులు, కేంద్రం మధ్య తొమ్మిది దఫాలుగా జరిగిన చర్చలు విఫలం కావడంతో.. ఏడాదిన్నర పాటు చట్టాలను నిలిపివేసే ప్రతిపాదనను కేంద్రం అన్నదాతల ముందు ఉంచింది. రైతులు మాత్రం ఆ ప్రతిపాదనను తిరస్కరించారు. ఆ మూడు సాగు చట్టాలను రద్దు చేయాలని పట్టుబట్టారు. చివరి దఫా చర్చలు కూడా విఫలం కావడంతో..'బంతి మీ కోర్టులోనే ఉంది. చట్టాలు రద్దు మినహా..మేము సూచించినదానికంటే మెరుగైన ఆలోచన ఉంటే చెప్పాలని వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ రైతు సంఘాలకు సూచించారు. చట్టాల రద్దుకే పట్టుబట్టిన రైతులు.. గణతంత్ర దినోత్సవం రోజున నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీ ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా ఎర్రకోట దగ్గర నిరసనలు వ్యక్తం చేయడంపై కేంద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు, సాగు చట్టాలపై కేంద్రం వైఖరిని నిరసిస్తూ.. పార్లమెంట్ ఉభయసభల ప్రారంభ సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగాన్ని విపక్షాలు బహిష్కరించాయి. ప్రస్తుతం దిల్లీ శివారుల్లో రైతుల నిరసన కొనసాగుతోంది. సాధారణంగా పార్లమెంట్ సమావేశాలకు ముందు అఖిల పక్ష భేటీ ఉంటుంది. కానీ ఈసారి సమావేశాలు ప్రారంభమైన తర్వాత అఖిల పక్ష భేటీ నిర్వహించారు. శుక్రవారమే బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే రైతు చట్టాలపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. అయితే రైతులు జాతీయ జెండాను అవమానించినట్లు రాష్ట్రపతి రామ్‌నాథ్ తన ప్రసంగంలో పేర్కొన్న విషయం తెలిసిందే.

# ఓఆర్ఆర్‌పై కారు ప్రమాదం

## అతివేగంతో స్తంభాన్ని ఢీఒకట్టిన డ్రైవర్

హైదరాబాద్,జనవరి30(ఆర్ఎన్ఎ): నగర శివార్లలోని రాజేంద్రనగర్‌లో పెను ప్రమాదం తప్పింది. మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్న కారు అదుపుతప్పి స్తంభానికి ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. టీఎస్ 12ఈకే 0298 నంబర్‌గల మారుతీ స్విఫ్ట్ కారు ఓఆర్ఆర్ మీదుగా గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్నది. ఈ క్రమంలో రాజేంద్రనగర్‌లోని హిమాయత్ సాగర్ సమీపంలో అదుపుతప్పి డివైడర్ మధ్యనున్న స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం, మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో వారికి ప్రమాదం తప్పిందని వెల్లడించారు. గాయపడినవారంతా హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు.

# బిఆర్కె భవన్ ముందు టీచర్ల ఆందోళన

హైదరాబాద్,జనవరి30(ఆర్ఎన్ఎ): మెరుగైన వేతన సవరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ఆందోళన చేపట్టింది. బీఆర్కే భవన్ వద్దకు వచ్చిన ఉపాధ్యాయ సంఘం నేతలు భవనం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, పీఆర్సీ కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏడున్నర శాతం ఫిట్‌మెంట్(వేతన సవరణ) ఆమోదయోగ్యం కాదని..

45శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళన కారులను అడ్డుకున్నారు. వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు మూలవే తనంపై 7.5 శాతం ఫిట్‌మెంట్(వేతన పెంపుదల) ఇవ్వాలని రాష్ట్ర వేతన సవరణ సంఘం ప్రభుత్వానికి ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. అయితే, పీఆర్సీ ప్రతిపాదించిన ఏడున్నర శాతం ఫిట్‌మెంట్ ఎంత మాత్రం ఆమోదయోగం కాదని.. 45శాతంతో వేతన సవరణ ప్రకటించాలని గత మూడు రోజులుగా ఉద్యోగ సంఘాల నేతలు ఆందోళన చేపడుతున్నాయి.

# అహంకార వైఖరి నుంచి బయటపడుతున్న కేంద్రం

## -అఖిలపక్ష భేటీ తరవాత అధీర్ రంజన్ వ్యాఖ్య

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ): రైతు చట్టాల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం విధానం ఇప్పుడిప్పుడే మారుతోందని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ ప్రశంసించారు. అహంకారం, మొండితనం నుంచి కేంద్రం ఇప్పుడిప్పుడే బయటపడుతోందని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశానికి అధీర్ రంజన్ హాజయ్యారు. సమావేశం ముగిసిన తర్వాత ఆయన పై వ్యాఖ్యలు చేశారు. రైతులు, ప్రభుత్వం మధ్య జరిగిన చర్చల సారాంశాన్ని మోదీ తమకు వివరించారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం పక్షాన ప్రతిపాదించిన ప్రతిపాదనలు రైతులకు నచ్చితే ఒక ఫోన్ కాల్ చేయవచ్చని, రైతులకు, ప్రభుత్వానికి ఒకే ఒక ఫోన్ కాలం మాత్రమే దూరమని పేర్కొన్నారని అధీర్ వివరించారు.

# ఎర్రకోటపై జరిగిన దాడికి భారీ కుట్ర

## - రైతు ఉద్యమాన్ని నీరుగార్చే యత్నం: కపిల్ సిబల్

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ): గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన ఎర్రకోట దాడిపై కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎర్రకోటపై జరిగిన దాడిని భారీ కుట్రగా అభివర్ణించారు. రైతు ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ఎన్నో కుట్రలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే ఈ దాడి జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని వెల్లడించారు. 'ఎర్రకోటలోకి ఎవరూ అనుమతి లేకుండా ప్రవేశించలేరు. కానీ ఆందోళనకారులు నేరుగా ఎర్రకోట వైపు వెళ్లారు. లోపలికి వెళ్లి ఆందోళనలు చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న వారే చెబుతున్నారు... తమను ఎవరూ అడ్డుకోలేదని. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆందోళనను దెబ్బతీయడానికి ఇలాంటి కుట్రలు అనేకం జరుగుతున్నాయం'టూ కపిల్ సిబల్ పేర్కొన్నారు.

# దేశంలో త్వరలో కోవావాక్స్ విడుదల

## బాగా పనిచేస్తుందన్న సీరం అధినేత అదర్ పూనావాలా

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ): కోవిడ్-19 మహమ్మారిపై పోరాటంలో భారత దేశం మరో ముందడుగు వేసింది. రెండు వ్యాక్సిన్లు అందుబాటులోకి రావడంతో ధైర్యాన్ని నింపుకున్న ప్రజలకు సీరం ఇన్‌స్టిట్యూట్ ఇండియా చీఫ్ అదర్ పూనావాలా మరో శుభవార్త చెప్పారు. జూన్‌లో తాము మరో వ్యాక్సిన్‌ను విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సంస్థ తయారు చేసిన కోవిషీల్డ్ వ్యాక్సిన్‌ను ఎమర్జెన్సీ వినియోగానికి అనుమతించిన సంగతి తెలిసిందే. పూనావాలా శనివారం ఇచ్చిన ఓ ట్వీట్‌లో, సీరం ఇన్‌స్టిట్యూట్ ఇండియా, నోవావాక్స్ భాగస్వామ్యంలో తయారైన కోవోవాక్స్ ప్రయోగాలు జరుగుతున్నాయని తెలిపారు.

## చరిత్రలో నేటినిజం







(జనవరి 31 కలైమామణి హాస్యనటుడు నగేష్ పుణ్యతిథి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

# 2012 దౌత్యవేత్తలు లక్ష్యంగా దాడులు

## వాటితో తాజా ఢిల్లీ దాడికి సంబంధం

## ఇజ్రాయెల్ అంబాసిడర్ రోన్ మాల్కా అనుమానం

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ): ఇజ్రాయెల్ ఎంబసీ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన పేలుడుకు, 2012లో ఆ దేశ దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడులకు సంబంధం ఉండి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. న్యూఢిల్లీలోని ఇజ్రాయెల్ అంబాసిడర్ రోన్ మాల్కా ఓ వార్తా సంస్థతో శనివారం మాట్లాడుతూ ఈ అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన పేలుడు నేపథ్యంలో భారత ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని చెప్పారు. తమకు మద్దతు, రక్షణ, సహాయం అందిస్తామని భారత ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 2012లో ఇజ్రాయెలీ దౌత్యవేత్తలపై ఉగ్రవాద దాడులు జరిగాయని, ఢిల్లీలోని ఇజ్రాయెలీ ఎంబసీకి సమీపంలోనే ఓ దాడి జరిగిందని చెప్పారు. తాజా దాడికి, ఆ దాడులకు సంబంధం ఉండే అవకాశం ఉందన్నారు. వ్యూహాత్మకంగా ఈ దాడులు జరుగుతూ ఉండవచ్చునన్నారు. శుక్రవారం జరిగిన దాడిపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. ఇది ఇజ్రాయెలీ ఎంబసీని లక్ష్యంగా చేసుకుని జరిగిన ఉగ్రవాద దాడి అని, ఈ దుశ్చర్య వెనుక ఎవరున్నారో ఇప్పుడే చెప్పడం తొందరపాటు అవుతుందని అన్నారు. అదృష్టవశాత్తూ ఎవరూ గాయపడలేదన్నారు. భారత ప్రభుత్వంపై తమకు సంపూర్ణ నమ్మకం ఉందన్నారు. భారత్, ఇజ్రాయెల్ ప్రభుత్వాల మధ్య సంపూర్ణ సహకారం ఉందని తెలిపారు. 2012 ఫిబ్రవరి 13న న్యూఢిల్లీలో ఓ కారుకు అమర్చిన మ్యాగ్నటిక్ బాంబు పేలింది. ఈ సంఘటన కూడా ఇజ్రాయెలీ ఎంబసీ సమీపంలోనే జరిగింది. ఈ దాడిలో ఓ ఇజ్రాయెలీ డిఫెన్స్ రాయబారి సతీమణి గాయపడ్డారు. అదే రోజు జార్జియన్ రాజధాని టిబిలిసిలో కూడా ఇజ్రాయెలీ దౌత్యవేత్త కారు క్రింద ఓ బాంబును పెట్టారు. అయితే ఆ బాంబు పేలకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ దుశ్చర్యల వెనుక ఇరాన్ ఉందని 2012లో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆరోపించారు. ఈ ఆరోపణలను ఇరాన్ తోసిపుచ్చింది.

# ఇజ్రాయెలీ ఎంబసీ పేలుడు జరిగిన చోట లేఖ

## గుర్తించిన దర్యాప్తు అధికారులు

## భారత్,ఇజ్రాయిల్ దౌత్య సంబంధాల బలోపేతంపై ఆగ్రహం

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని నగరంలోని ఇజ్రాయెలీ ఎంబసీ వద్ద శుక్రవారం పేలుడు జరిగిన చోట ఓ లేఖను దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఒకటిన్నర పేజీలు ఉన్న ఈ లేఖలో ఇజ్రాయెలీ ఎంబసీ అధికారులకు హెచ్చరికలు ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ పేలుడు కేవలం ట్రయిలరేనని, అసలు కథ ముందు ఉందని ఈ లేఖలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్, భారత దేశం మధ్య పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు ఏర్పడి 28 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వార్షికోత్సవాలను జరుపుకున్నారు. అదే సమయంలో ఈ దాడి జరగడం యాధృచ్ఛికం కాదని, కుట్రపూరితంగానే ఈ దాడి జరిగిందని ఇజ్రాయెలీ ఎంబసీ వర్గాలు చెప్తున్నాయి. విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం, ఇజ్రాయెలీ ఎంబసీ వద్ద పేలుడు జరిగిన చోట దొరికిన లేఖలో, ఇరాన్ జనరల్ ఖాసిం సోలిమనీ, టాప్ న్యూక్లియర్ సైంటిస్ట్ మొహిసిన్ ఫక్రిజదేహాలను అమరవీరులుగా అభివర్ణించినట్లు తెలుస్తోంది. జనరల్ ఖాసిం గత ఏడాది జనవరిలో ఇరాక్‌లో అమెరికన్ డ్రోన్ దాడిలో మరణించిన సంగతి తెలిసిందే. న్యూక్లియర్ సైంటిస్ట్ మొహిసిన్ 2020 నవంబరులో ఉత్తర ఇరాన్‌లో జరిగిన దాడిలో మరణించారు.

ఈ లేఖను ఇజ్రాయెల్ ఎంబసీ అధికారులను ఉద్దేశించి రాసినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. అయితే ఇతర వివరాలను వారు వెల్లడించలేదు. ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ బృందం శనివారం ఉదయం ఈ ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. శుక్రవారం సాయంత్రం 5.05 గంటలకు జరిగిన ఈ పేలుడులో ఎవరూ గాయపడలేదని, ఆస్తి నష్టం సంభవించలేదని తెలిపారు. ఈ ప్రదేశం నుంచి ఓ బ్యాటరీని, కొన్ని ఎలక్ట్రిక్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ పేలుడు కోసం టైమర్‌ను ఉపయోగించి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. దర్యాప్తు అధికారులు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు.

# సొంత వ్యవసాయ విధానాలు పాటించిన రాష్ట్రాలు !

నేటి నిజం
ఆదివారం 31-1-2021

దేశంలో ఏ రాష్ట్రమైనా వ్యవసాయ విధానాలను రూపొందించుకుని ముందుకు సాగే వెసలుబాటు ఉంది. కేంద్రంతో సంబంధం లేకుండా వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, పంటలను కొనుగోళ్లు చయడం బ్రహ్మ విద్యేమీ కాదు. కానీ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం ఇతరత్రా ప్రయోజనాలను ఆశించడం వల్ల ఈ విషయంలో ప్రణాళిక లేకుండా సాగుతున్నారు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో వ్యవసాయంలో పురోగతి సాధించవచ్చు. కేంద్రాన్ని తిడుతూ కూర్చునే కన్నా కార్యాచరణ చేసి విజయం సాధించవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో అనేక అవకాశాలు ఉన్నా, వనరులు ఉన్నా పటిష్టమైన విధానాలు అవలంబించడం లేదు.. దీంతో పంటలు పండించే రైతులకు గిట్టుబాటు కావడం లేదు. కొనుగోళు చేసే ప్రజలకు భారం అవుతోంది. రైతులకు, ప్రజలకు మధ్యఅనుసంధానంగా ఉంటూ పంటల ప్రణాళిక, వ్యవసాయ విధానాలు రూపొందితే అన్నదాతలకు, ప్రజలకు మేలు జరగగలదు. తెలంగాణలో నీటి లభ్యత పెరిగింది. ఉచిత కరెంట్ ఇస్తున్నారు. కానీ పండిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే యంత్రాంగాన్ని నిర్మించలేదు. ఏయేటి కాయేడు పంటల కొనుగోళ్ల సమయంలో ఆందోళనలు సర్వసాధారణంగా మారాయి. పెట్టుబడి కింద ఎకరానికి ఏటా ఇస్తున్న డబ్బులు వృధా అవతున్న విషయం ప్రభుత్వానికి తెలుసు. అయినా దానిని సమీక్షించడం లేదు. పొరంబోకు భూములకు, తోటలకు ,డబ్బున్న వాళ్లకు కూడా ప్రభుత్వం నుంచి సొమ్ము అందుతోంది. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో చెల్లిస్తున్న ధనాన్ని పంచడం ఎంతవరకు భావ్యమో ఆలోచించడం లేదు. ఆ డబ్బును పంటల కొనుగోళ్లకు వినియోగించి..రైతులను ఆదుకోవచ్చు. వారికి మద్దతు ధరలను మించి ధరలు చెల్లించవచ్చు. అలాగే ఆ పంటను ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావచ్చు. కానీ లేనిదల్లా చిత్తశుద్ధి మాత్రమే. తమది రైతు ప్రభుత్వమని సిఎం కెసిఆర్ మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు ఢంకా బజాయిస్తునా ఏటా సరిగా పంటలు కొనుగోళ్లు చేయలేని దుస్థితలో ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో ప్రధానంగా సాగయ్యే కందిపంట కొనుగోళ్ల సీజన్ వచ్చినా సరైన ప్రణాళిక లేదు. పంట చేతికొచ్చి పక్షం రోజులు గడిచిపోతున్నా కొనుగోళ్ల పక్రియను ప్రారంభించక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ అధికారులతో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశమై పంటల సాగు, కొనుగోళ్ల పక్రియపై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సాగు చట్టాల ప్రకారమే కొనుగోళ్లను చేపడుతామని కొంతకాలంగా ప్రభుత్వం చెబుతూ వస్తోంది. దీంతో కందుల కొనుగోళ్లపై సందిగ్ధ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు వరుసగా మద్దతు ధరలు లేక పోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది కందులకు క్వింటాలు మద్దతు ధర రూ.5,800 ఉండగా ఈ సారి రూ.200 పెంచి రూ.6వేల మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. అయితే కనీసం క్వింటాలుకు రూ.8వేల నుంచి 10వేల వరకు మద్దతు ధర ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలో 140 పెటట్ఇ కొంటున్నారు. ఇప్పటికే చేతికొచ్చిన కంది పంటను ఇంట్లోనే నిల్వ చేసుకుంటున్న రైతులు కొనుగోళ్ల కోసం ఎదురు చూడక తప్పడం లేదు. ప్రభుత్వ నిర్ణయంతో సొసైటీల ఆదాయానికి గండిపడే అవకాశం ఉంది. ఇన్నాళ్లు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘాల ద్వారా కందులను కొనుగోలు చేసేవారు. ఈ సారి మాత్రం సాగుచట్టాల ప్రకారం మార్కెట్‌కు తరలించాలన్న నిబంధన విధిస్తున్నారు. ఇప్పటి వరకు సహకార సంఘాలకు కందుల కొనుగోళ్లపై ఎలాంటి ఆదేశాలు లేక పోవడంతో కందుల కొనుగోళ్లు ఉండవనే చెబుతున్నారు. పంటల కొనుగోళ్ల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే సొసైటీలకు ప్రభుత్వ నిర్ణయం కొంత ఇబ్బందికరంగానే మారనుంది. 1శాతం కమిషన్‌పై కొనుగోలు చేయడంతో కొన్ని సొసైటీలకు లక్షల్లో ఆదాయం వచ్చేది. ఇకపోతే పసుపు రైతులదీ ఇదే కష్టం. వారికి కూడా ధరలు రావడం లేదు. గతంలో బాబా రాందేవ్‌బాబను తీసుకుని వచ్చి హడావిడి చేసిన ఆనాటి ఎంపి కవిత ఇప్పుడు చేతు లెత్తేశారు. దీనిచుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో పసుపును సాగు చేసే రైతులకు నష్టాలే తప్ప లాభాలు రావడంలేదు. ఎకరం సాగు చేయ డానికి రైతులు రూ.లక్షా 20వేల నుంచి రూ.లక్షా 50వేల వ రకు ఖర్చు చేస్తున్నారు. పసుపు సగటు దిగుబడి 20 క్వింటాళ్లు వస్తోంది. ప్రస్తుతం క్వింటా పసుపు ధర సుమారు రూ.5వేలు మాత్రమే ఉంది. ఈ ధరతో రైతులకు పెట్టుబడులు కూడా మిగలడం లేదు. పసుపు సాగు చేసినందుకు నష్టాలనే మూటగట్టు కుంటున్నారు. ముందు తరాల వారు సాగు చేస్తున్నందున ఈ తరం వారు నష్టం వచ్చినా సాగును కొనసాగిస్తున్నారు. అన్ని పంటలకు మద్దతు ధరలు, పంటల పెట్టుబడుల ధరలు పెరిగినా పసుపు ధర మాత్రం పెరగడం లేదు. ఏటికేడు అన్ని వస్తువుల ధర పెరగడం సాధారణంగా మారినా పసుపు ధర మాత్రం దిగిపోయింది. పదేళ్ల క్రితం క్వింటాకు రూ.6వేల పైన ధర పలికింది. ప్రస్తుతం అంతకంటే ధర తక్కువగా ఉండడం పసుపు రైతు దీన పరిస్థితికి అద్దం పడుతోంది. పసుపు మద్దతు ధరల జాబితాలో లేనందునే ఈ పరిస్థితి ఏర్పడింది.పసుపునకు మద్దతు ధర ఉంటే ఇంత దారుణమైన స్థితి ఉ ండదు. పంటలకు ధర లేనప్పుడు ప్రభుత్వాలు ఎంఐఎస్ కింద కొనుగోలు చేసే వీలుంది. కానీ ప్రభుత్వాలు కొనుగోలుకు ముందుకు రావడంలేదు. గతంలో మార్క్‌ఫెడ్ నామ మాత్రంగానే కొనుగోలు చేసినా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంతో మార్కెట్‌లో పోటీ ఏర్పడింది. ప్రభుత్వం క్వింటాకు రూ.4వేలు చెల్లించగా, బహిరంగా మార్కెట్‌లో వ్యాపారులు ఇంత కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేశారు. బయట డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులే ధర పెంచడం లేదు. తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు. ఆరుగాలం చెమటోడ్చి పంట పండించిన రైతులకు నష్టాలు వస్తే, కూర్చున్న దగ్గర వ్యాపారులకు పెద్ద మొత్తంలో లాభాలు రావడం గమనార్హం. సమగ్ర వ్యవసాయ విధానాలు అవలంబించి ఉంటే ఏపం వేయాలో..ఏ పంటను ఎప్పుడు కొనుగోలు చేయాలో..ప్రజలకు వాటిని ఎలా సరఫరా చేయాలో అవగాహన ఉండేది. ప్రజలకు రైతులకు వారధిగా ప్రభుత్వాలు పనిచేయనంత కాలం దళారులే లాభపడతారని గుర్తించాలి.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ పల్లా

తిరుమల,జనవరి30(ఆర్ఎన్ఎ): కలియుగ వైకుంఠం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా తిరుమల వచ్చిన ఆయన ఇవాళ ఉదయం వీఐపీ విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఎమ్మెల్సీ దంపతులను పట్టువస్త్రంతో సత్కరించారు. స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఆగ్రా రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం
### పదిమంది ప్రయాణికుల దుర్మరణం




లక్నో,జనవరి30(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ – ఆగ్రా రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. మినీ బస్సు – ట్రక్కుతో పాటు మరో వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద ఘటనపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ. 50 వేలు చొప్పున ప్రకటించారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యశాఖ అధికారులను సీఎం యోగి ఆదేశించారు. ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు.

## ఇక మారుమూల పల్లెలకు ఇంటర్నెట్
### -ఏపీ ఫైర్ నెట్ ఛైర్మన్ గౌతమ్ రెడ్డి

విశాఖపట్నం,జనవరి30(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇంటర్‌నెట్ పార్కుల ఏర్పాటుకు కృషి చేస్తామని, సాంకేతిక విప్లవం తీసుకువస్తామని ఏపీ ఫైర్ నెట్ ఛైర్మన్ గౌతమ్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏపీ ఫైబర్ కేబుల్ నెట్ వర్క్ మొత్తం విశాఖపట్నం నుంచే మొదలవుతుంది. ఫైబర్ నెట్ వర్క్ సేవల్ని మరింత పటిష్టం చేస్తాం. ఫైబర్ నెట్‌కు రెండు ఎకరాలు కేటాయించారు. ప్రతి పల్లెకు ఇంటర్ నెట్ సేవలు అందిస్తాం. గూగుల్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న బ్యాండ్ విడ్త్ స్పీడ్ పెంచుతాం. 10 లక్షల కనెక్షన్లు ఉన్న వాటిని 50–70 లక్షల కనెక్షన్లు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆయన వివరించారు. గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగాయి. విచారణ జరుగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిగారి ఆలోచనలకు అనుగుణంగా ఏపీ ఫైబర్ నెట్ సేవలు విస్తరిస్తామని గౌతం రెడ్డి తెలిపారు. మారుమూల పల్లెల్లో కూడా ఇక ఇంటర్ నెట్ సేవలు అందుబాటులోకి వస్తాయి. 599 రూపాయలు చెల్లిస్తే ఆన్ లిమిటెడ్ ఇంటర్ నెట్. చాలా క్వాలిటీతో కూడిన సేవల్ని అందిస్తామన్నారు.

## ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు తుదిగడువు ఫిబ్రవరి 11

హైదరాబాద్, జనవరి 30: ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలను తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు శనివారం ప్రకటించింది. ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు ఫిబ్రవరి 11 వరకు తుదిగడువు విధించినట్లు బోర్డు తెలిపింది. రూ. 100 ఆలస్య రుసుంతో ఫిబ్రవరి 22 వరకు, రూ. 500 ఆలస్య రుసుంతో మార్చి 2వ తేదీ వరకు, రూ.1000 ఆలస్య రుసుముతో మార్చి 9 వరకు, అదే రూ. 2 వేల ఆలస్య రుసుముతో మార్చి 16వ తేదీ వరకు ఫీజు చెల్లింపు గడువును పెంచింది.

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను మే 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. మే 1 నుంచి 19 వరకు ప్రథమ సంవత్సరం, మే 2 నుంచి 20 వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయంది. ఏప్రిల్ 7 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. ఇంటర్నల్ పరీక్షలయిన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షను ఏప్రిల్ 1న, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను ఏప్రిల్ 3న నిర్వహించనున్నామని చెప్పారు. ఒకేషనల్ కోర్సులకూ ఇదే టైంటేబుల్ వర్తిస్తుందని పేర్కొన్నారు.



# పసుపు రైతుల చుట్టూ రాజకీయం

### అయినా రైతులకు దక్కని ప్రతిఫలం
### ఏటా పసుపు కొనగోళ్లపై వీడని ప్రతిష్టంభన



నిజామాబాద్ ,జనవరి30(ఆర్ఎన్ఎ): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు దశాబ్దాలకుపైగా పసుపు రైతుల చుట్టే రాజకీయం నడుస్తోంది. పసుపు బోర్డుతోపాటు మద్దతు ధర కల్పించాలని రైతులు చేస్తున్న డిమాండ్‌ను రాజకీయ పార్టీల నేతలు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రతి ఎన్నికల్లో పసుపును ఆయుధంగా తీసుకొని ఎంపికవుతున్నారు. ఇప్పటి వరకు మాత్రం ఎలాంటి ఫలితం రాలేదు. కాంగ్రెస్ గతంలో పదేళ్లు అధికారంలో ఉన్నా ఈ సమస్యను పట్టించుకోలేదు. అలాంటి పార్టీ ఇవాళ రైతుల సమస్యలపై తగుదునమ్మా అని పోరాటాలు చేస్తోంది. తాజాగా రేవంత్ రెడ్డి జిల్లాలో దీక్షకు దిగడం రాజకీయం తప్ప చిత్తశుద్ధితో చేసే పని కాదని గుర్తించాలి. బీజెపి కూడా చిత్తశుద్ధి కనబర్చడం లేదు. ఆయా పార్టీల నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికైనా.. పసుపు రైతుల ఆశలు మాత్రం నెరవేరలేదు. వారికి కావలసిన మద్దతు ధర రాలేదు. పసుపునకు మద్దతు ధర, పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని రైతులు అనేక ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. జిల్లా నుంచి ఢిల్లీ వరకు ఆందోళన చేశారు. జిల్లాలో రహదారులు దిగ్భంధించారు. కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 178 మంది పసుపు రైతులు నామినేషన్‌లు వేసి భారతదేశ దృష్టిని ఆకర్షింపజేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి అత్యధిక మంది పోటీ చేశారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్ పసుపు బోర్డు, మద్దతు ధర సాధిస్తానని లిఖితపూ ర్వకంగా బాండ్ రాసిచ్చారు. పసుపు బోర్డుకంటే ఎక్కువ ప్రయోజనాలు కలిగే స్పైసెస్ బోర్డు మంజూరు చేయించానని అర్వింద్ చెబుతుంటే, తమకు బోర్డే కావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పసుపు ధర మీద ఫ్యూచర్ ట్రేడింగ్ ప్రభావం బాగా కని పిస్తోంది. పసుపు గతంలో ఫ్యూచర్ ట్రేడింగ్‌లో లేదు. 2013 జూలై 31న ఫ్యూచర్ ట్రేడింగ్‌లో చేర్చారు. అప్పటి నుంచి ధర పెరగడం లేదు. పసుపును ఫ్యూచర్ ట్రేడింగ్ జాబితా నుంచి తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పసుపు సాగుకు ఎకరా కు రూ.లక్షా 20 వేల వరకు పెట్టుబడి పెడుతున్నాం... మద్దతు లేదు. పట్టించుకునే వారు లేరు. ప్రతీ యేడాది కూలీల ఖర్చు పెరుగుతోంది. వెయ్యి రూపాయలు ఇస్తే తప్ప కూలీలు దొరకడం లేదు. కష్టపడి పండించినా ధర రావడం లేదు. ప్రభుత్వాలే పసుపు రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. పసుపును రైతు ఇంటికి తెచ్చుకుని నిల్వ చేయలేదు. రైతుకు గిట్టుబాటు అవుతుందా? లేదా? అనేది వ్యాపారికి గానీ, అధికారులకు గానీ అవసరం లేదు. నాణ్యమైన పసుపునకు కూడా ధర రావడం లేదు. స్వల్ప కాలిక రకాలలో కర్క్యుమిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. స్వల్పకాలికరకాలైన ప్రతిభ, ఏసీసీ తదితర రకాలలో నాలుగు శాతం ఉంటే, ఎర్రగుంటూరు తదితర లోకల్ రకాలలో 2.5శాతం ఉంటుంది. స్వల్పకాలిక రకాలు ముందుగానే మార్కెట్‌కు వస్తుంది. మార్కెట్‌లో పసుపులేని సమయంలో రావడమే కాక, కర్క్యుమిన్ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ వ్యాపారులు ధర పెరగకుండా చేస్తున్నారు.

పసుపుతో ప్రభుత్వాలకు, వ్యాపారులకు ఆదాయం వస్తున్నా.. రైతుల ఇబ్బందులను మాత్రం పట్టించు కోవడం లేదు. సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావడం లేదు. అప్పులు తెచ్చి పెడితే గిట్టుబాటు రావడం లేదు. రాజకీయాలు మాని అన్ని పార్టీల నేతలు పసుపు రైతులను ఆదుకునేందుకు కృషిచేయాలి.

# నిరంతర విద్యుత్ సరఫరా ఓ సఫల ప్రయోగం

### విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
### దేశంలో అవకాశం ఉన్నా పట్టించుకోని కేంద్రం

హైదరాబాద్,జనవరి30(ఆర్ఎన్ఎ): ప్రత్యర్థుల అంచనాలకు, ఊహలకు అందని విధంగా అనూహ్య నిర్ణయాలు తీసుకోవడం ద్వారా తెలంగాణలో తనకు తిరుగులేదని కేసీఆర్ రుజువు చేసుకుంటున్నారు. ఓ వైపు అభివృద్ధి మరోవైపు రాజకీయ నిర్ణయాలతో ఆయన తిరుగులేని నేతగా నిరూపించుకుంటున్నారు. అందుకే ప్రత్యర్థుల ఊహలకు సైతం అందనంత దూరంలో ఉంటున్నారు. దీంతో విపక్షాలు ఏకమైనా కెసిఆర్‌ను ఓడించడం అసాధ్యమన్న భావన సర్వత్రా నెలకొంది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడ్డ తరవాత రాష్ట్రం కేసీఆర్ చేతుల్లో కాకుండా మరొకరి చేతుల్లోకి వెళ్లి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ఓ అద్భుతం. దేశంలో ఎక్కడా లేనిది తెలంగాణలో మాత్రమే వ్యవసాయానికి 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయడం సాధ్యమవుతుందని నిరూపించారు. అలాగే పరిశ్రమలకు కూడా నిరంతరాయంగా విద్యుత్ అందుతోంది. గృహ,పరిశ్రమలతో పాటు వ్యవసాయానికి కూడా నిరతంర విద్యుత్ అందుతోంది. అందుకే ఈ మధ్య మంత్రి కెటిఆర్‌తో పాటు మంత్రులు కూడా ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో ఉన్న సమస్యలు ఇప్పుడు లేదు. ఇకపోతే నాలుగైదేళ్ల క్రితం వరకు దేశంలో విద్యుత్ కొరత తీవ్రంగా ఉండేది. ఒక్క యూనిట్ విద్యుత్‌ను పన్నెండు రూపాయలకు పైగా పెట్టి కొనుగోలు చేసిన రోజులు ఉన్నాయి. డబ్బు పెట్టినా అవసరమైనంత విద్యుత్ దొరికేది కాదు. కానీ ఇప్పుడు ఉత్పత్తి పెరిగి కావలసినంత విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. కొనుగోలు చేసేవారు లేక ప్రైవేటు థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉత్పత్తిని నిలిపివేశాయి. అయితే దేశవ్యాప్తంగా నిరంతర విద్యుత్ ఇవ్వాలన్న ఆలోచన రావడం లేదు. ఇదే విషయాన్ఇన టిఆర్ఎస్ రాజకయీ అస్త్రంగా వినియోగించుకుంటోంది. అయితే తాజాగా పోటీ పెరిగి విద్యుత్ ధరలు తగ్గిపోయాయి. ఇప్పుడు విద్యుత్ ధర యూనిట్‌కు గరిష్ఠంగా అయిదున్నర రూపాయలే పలుకుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేసినా పెద్దగా ప్రభావం పడదని అంచనా వేసారు. వ్యవసాయానికి ఎనిమిది గంటలపాటు విద్యుత్తు సరఫరా చేసినా, 24 గంటల పాటు సరఫరా చేసినా వినియోగించే విద్యుత్‌లో తేడా ఏమీ ఉండదని గుర్తించారు. కాకపోతే పంపిణీ వ్యవస్థను మెరుగు పర్చుకోవడం ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ విజయం సాధించారు. వినియోగం పెరిగినా గ్రిడ్ సరఫరా దెబ్బతినకుండా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయించారు. ఇకపోతే గతంతో పోల్చితే విద్యుత్ ధరలు తగ్గినందున ఎంత విద్యుత్ కొనుగోలు చేసినా పెద్దగా భారం ఉండటం లేదు. గతంలో ఇంత విద్యుత్ కొనుగోలు చేయాలంటే తడిసి మోపెడయ్యేది. ఈ పరిణామాలన్నింటినీ గ్రహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ సత్వర నిర్ణయం తీసుకున్నారు. అందుకే నిరంతర విద్యుత సరఫరా నిర్ణయాన్ని అందరూ పొగుడుతున్నారు. కానీ కాంగ్రెస్ వారు దీనిని విమర్శిస్తూ చేస్తున్న ప్రకటనలతో ప్రజల్లో అభాసుపాలయ్యారు. కెసిఆర్ బలమంతా నిరంతర కరెంట్ సరఫరా అన్న విషయం వారు గుర్తించి దీనిని విఫలప్రయోగంగా ప్రచారం చేస్తున్నారు. అయితే దీనిపై మట్లాడి అనవసరంగా కరెంట్ షాక్‌కు గురవుతున్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రజామోదం పొందడంలో కరెంట్ సరఫరాదే ప్రధాన నిర్ణయంగా చెప్పుకోవాలి. ఇక కాళేశ్వరంపై కాంగ్రెస్ తప్ప అంతా పొగిడి అద్భుతమని కీర్తిస్తున్నవారే. ఃరాజకీయ పరమైన వ్యూహాలతోనే కాకుండా పాలనాపరంగా కూడా అవసరమైనప్పుడు కఠిన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా తాను ఏమిటన్నది కేసీఆర్ నిరూపించుకు ంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గురించి ఇతరరాష్ట్రాల్లోనే మంచి పేరు రావడానికి అమలు చేస్తున్న పథకాలే కారణంగా చెప్పుకోవాలి. నిరంతర విద్యుత్ కోసం సొంతంగా తెలంగాణ ఉత్పత్తిపైనా దృష్టి సారించడం వల్లనే ఇబ్బందులు లేకుండా పోయాయి. ఇప్పుడు ప్రగతిలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే ఇతర ప్రాంతాలకు కూడా అందించే అవకావం వస్తుంది. అంతెందుకు పక్క రాష్ట్రమైన ఎపిలో నిరంతర విద్యుత్ జోలికి వెళ్లడం లేదు.

# ఆందోళనలో కంది రైతులు

### ఒక్కో రైతు నుంచి 18 క్వింటాళ్లు మాత్రమే
### కొనుగోళ్లపై అధికారుల వెల్లడి

ఆదిలాబాద్,జనవరి30(ఆర్ఎన్ఎ): ఈ యేడు సాగు విస్తీర్ణం గణనీయంగాపెరగడంతో కంది దిగుబడులు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. గతేడు జిల్లా వ్యాప్తంగా 2లక్షల 16వేల క్వింటాళ్ల కందులను మార్క్‌ఫెడ్

ద్వారా కొనుగోలు చేశారు. ఈ సారి కొనుగోళ్లకు అనుమతించకపోవడంతో సొసైటీలు ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది.

దీంతో సొసైటీల నిర్వాహణ, సిబ్బందికి వేతనాల చెల్లింపులకు ఇబ్బందికరంగా మారనుంది. సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోళ్లకు అనుమతి ఇస్తే స్థానికంగానే రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకునే అవకాశం కూడా ఉంటుంది. జిల్లాలో జైనథ్, ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ, తాంసి, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, బేల,నార్నూర్ మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే ఎకరాన రెండున్నర క్వింటాళ్ల కందులను మాత్రమే సేకరించాలని మార్క్‌ఫెడ్ అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. గరిష్ఠంగా ఒక్కోరైతు నుంచి 18క్వింటాళ్ల కందులను మాత్రమే కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. దీంతో మెజార్టీ రైతులు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలున్నాయి. 10ఎకరాల కంది పంట వేసిన రైతు నుంచి 25 క్వింటాళ్ల వరకు కందులను కొనుగోలు చేయాల్సి ఉండగా 18 క్వింటాళ్లకే పరిమితం చేయడంతో అయోమయ పరిస్థితులకు దారి తీస్తోంది. జిల్లాలో 3లక్షల క్వింటాళ్ల దిగుబడులకు గాను లక్షా 51వేల క్వింటాళ్లను మాత్రమే కొను గోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ సిద్ధమవుతోంది. మిగతా లక్షా 50వేల క్వింటాళ్లు ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకునే పరిస్థితి ఏర్పడనుంది.

## మహాత్ముడి జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం
### -నివాళి అర్పించిన మంత్రి హరీష్ రావు



సిద్దిపేటలో మహాత్ముడి విగ్రహం వద్ద నివాళి అర్పించిన మంత్రి హరీష్ రావు.

సిద్దిపేట,జనవరి30(ఆర్ఎన్ఎ): భారత స్వాతంత్య్ర పోరాటాన్ని, గాంధీజీని విడదీసి చూడలేమని మంత్రి హరీశ్ రావు అన్నారు. మహాత్ముడి జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంత్రి ఘనంగా నివాళులర్పించారు. సత్యాగ్రహం, అహింస పాటించడానికి ఎంతో ధైర్యం కావాలని, ఆ అసమాన ధైర్యంతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి అహింస, సత్యాగ్రహానికి ఉన్న శక్తిని నిరూపించి చూపారని వెల్లడించారు. ఎప్పటికైనా సత్యానిదే అంతిమ విజయమని మహాత్ముని జీవితం చాటి చెబుతుందన్నారు. ప్రపంచదేశాలకు ఆయన ప్రవచించిన సిద్ధాంతాలు అనుసరణీయమని చెప్పారు. గాంధీజీ సిద్ధాంతాలు నేటి పాలకులు, ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. భారతీయులుగా గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించినపుడే ఆయన ఆశయాలకు ఒక అర్థం, పరమార్థం చేకూరుతుందన్నారు.

## శ్రీశైలం రహదారిపై ప్రమాదం.. ఇద్దరు దుర్మరణం



అమ్రాబాద్, జనవరి 30: శ్రీశైలం–హైదరాబాద్ రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడటంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమపెంట వద్ద శనివారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరిగింది. మృతులను హైదరాబాద్‌కు చెందిన చంద్రశేఖర్, సరస్వతిగా పోలీసులు గుర్తించారు. వీరంతా దైవదర్శనానికి శ్రీశైలంవెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు సమాచారం.

విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వెదురు సాగుతో లాభాలు మెండు
### హోసూరులో వెదురు పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,జనవరి30(ఆర్ఎన్ఎ): తెలంగాణలో వెదురు సాగును ప్రోత్సహించేందుకు తగినచర్యలు తీసుకుంటామని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వెదురు సాగుతో రైతులకు లాభాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆయన అన్నారు. హోసూరులో గ్రోమోర్ బయోటెక్ లిమిటెడ్ వెదురు పరిశోధన మంత్రి నిరంజన్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా వెదురు సాగు వల్ల ఎలాంటి ప్రయోజనాలున్నాయన్న విషయంపై మంత్రి మాట్లాడుతూ దేశం ఏడాదికి 200 మెట్రిక్‌టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుంది. అలాగే దేశంలో 50లక్షల ఎకరాల్లో వెదురు సాగుతో ఇథనాల్ తయారు చేయడం మూలంగా మన ఇంధన అవసరాలు తీరతాయని చెప్పారు. గ్రోమోర్ బయోటెక్ లిమిటెడ్ అధినేత, ప్రఖ్యాత వెదురు శాస్త్రవేత్త భారతి అనుభవం వెదురు సాగులో ఉపయోగించు కోవాలన్నారు. భారతి అనుధవం విన్న తర్వాత స్వయంగా వెదురుసాగు చేయాలని నిర్ణయించుకున్నట్టు మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇక్కడి టిష్యూ కల్చర్ విభాగం బాగుందని ప్రశంసించారు. బీమా బంబూ ఇథనాల్ (÷–లబెండ్) తయారీకి అనుకూలమైందన్నారు.వెదురు ఒక్కసారి నాటితే 60, 70 ఏళ్లపాటు దిగుబడి , నాలుగో ఏడాది నుంచే దిగుబడి ప్రారంభమవుతుందన్నారు. ఎకరాకు లక్షా 20వేల నుంచి లక్షా 60వేల వరకు ఆదాయం ఉంటుందని మంత్రి తెలిపారు. వెదురు ఉత్పత్తి విషయానికి వస్తే ఏడాదికి ఎకరాకు 40 టన్నుల దిగుబడి ఉంటుందని, అలాగే టన్నుకు 4500 రూపాయల ధర పలికే అవకాశం ఉందన్నారు. ఈసందర్భంగా మంత్రి వెంట తెలంగాణ ఉద్యానవన శాఖ డైరెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఇండియాలో కోవిడ్ కల్లోలానికి ఏడాది....!

**(ఇండియాలో కరోనా ప్రవేశించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా)**

చైనాలోని వూహాన్ నగరంలో 27 డిసెంబర్ 2019న తొలి కరోనా కేసు బయట పడింది. 30 జనవరి 2020న వూహాన్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న కేరళ విద్యార్థిని స్వరాష్ట్రం చేరగానే కరోనా నిర్ధారణ కావడంతో భారత్ ఉలిక్కిపడింది. నాటి నుంచి నేటికి కోట్ల మందికి కరోనా సోకడం, లక్షల్లో మరణాలు సంభవించడంతో ప్రపంచ మానవాళి కంటికి కునుకు లేకుండా పోయింది. కంటికి కనిపించని ఓ సూక్ష్మ వైరస్ ప్రపంచాన్ని కమ్మేసింది. గత ఏడాది కాలంగా విశ్వమానవాళిని అతలాకుతలం చేసింది. 2020 ఏడాది ఓ చేదు జ్ఞాపకంగా చరిత్రలో నిలిచింది. శతాబ్దానికో ప్రళయం జరుగుతుందన్న మాట మహమ్మారి విజృంభనతో నిజమైంది. ప్రపంచ దేశాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఊపిరి పీలుస్తున్నారు. కోవిడ్ మేఘాలు ఇంకా వీడనే లేదు. కరోనా కట్టడికి ప్రజలు కూడా వెంటనే స్పందించి మాస్కులు, సామాజిక దూరాలు, సానిటైజర్ వాడకాలు, వ్యాధినిరోధక శక్తి పెంచుకోవడానికి పోషకాహారం, శారీరక వ్యాయామం, నీటి ఆవిరి పీల్చడం లాంటి అలవాట్లను జీవనశైలిలో భాగం చేసుకున్నారు. అధిక జనాభా, నిరక్షరాస్యత, పేదరికం లాంటి సమస్యలతో సతమతం అవుతున్న భారతంలో ప్రజాస్పందన అపూర్వమేనని చెప్పవచ్చు. కోవిడ్–19 విష ప్రభావానికి వలసదారుల ఇక్కట్లు, ఉద్యోగ ఉపాధి కోతలు, వేతన కత్తిరింపులు, ధరల పెరుగుదల లాంటి సమస్యలతో బతుకులు ఛిద్రం కావడం కూడా జరిగింది. విద్యాలయాలు, కార్యాలయాలు, వ్యాపారాలు మూత పడడంతో లక్షల కుటుంబాలు బజారున పడడం మనం ఇంకా మరిచిపోనేలేదు. ఈ విపత్కర పరిస్థితుల్లో వ్యవసాయమే దేశాన్ని ఆదుకొని, ఆర్థికంగా మరింత కుంగిపోకుండా నిలుపగలిగింది. కుటుంబ, దేశ మరియు ప్రపంచ మానవాళి జీవనశైలి మరియు ఆర్థిక స్థితుల్లో తీవ్ర ప్రభావం పడింది. కరోనాతో భారత్‌లో భారీ ప్రాణనష్టం జరగవచ్చని ప్రపంచదేశాలు హెచ్చరించాయి. కాని దీనికి విరుద్ధంగా భారత్‌లో మరణాలు మరియు కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతున్నాయి. నేటికీ పలు పాశ్చాత్య దేశాల్లో సెకండ్ మరియు థర్డ్ వేవ్ ప్రకంపనలు మరియు కొత్త బ్రిటన్ స్టేయిన్ భయంతో చిగురుటాకులా గజగజ వణికి పోతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా నేడు 10 కోట్లు దాటిన కరోనా కేసులు మరియు 22 లక్షల మరణాలు నమోదుకాగా, ఇండియాలో కోటి దాటిన కోవిడ్–19 కేసులతో 1.5 లక్షల మరణాలు జరిగాయి. తెలంగాణలో నేటికి 2.94 లక్షల కేసులతో 1,596 మరణాలు నమోదు కాగా, ఆంధ్రలో 8.87 లక్షల కేసులు మరియు 7,152 మరణాలు జరిగాయి. కరోనా వ్యాప్తిని అడ్డుకోవడానికి భారత ప్రభుత్వం సకాలంలో స్పందించి 24 మార్చి 2020న లాక్‌డౌన్ విధించి మే 2020 వరకు పొడిగించడంతో భారీ ప్రమాదం తప్పిందని అభిప్రాయపడుతున్నారు. మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్ర రాష్ట్రాల్లో కేసులు అధికంగా బయట పడ్డాయి. భారత్‌లో కరోనా మరణాల రేటు 1.4 శాతం మాత్రమే ఉండగా మెక్సికోలో 8.7 శాతం, ఇటలీలో 3.5 శాతం, యూకే 2.6 శాతం, అమెరికాలో 1.7 శాతంగా నమోదైంది. నేడు భారత జాతీయ రికవరీ రేటు 96 శాతంగా ఉండడం మన అదృష్టం. ఐసియంఆర్ సర్వే ప్రకారం భారత్‌లో 50 కోట్ల మందికి కరోనా వ్యాపించి ఉండవచ్చని, దీని ప్రకారం సామూహిక వ్యాధినిరోధక శక్తి (హెర్డ్ ఇమ్యూనిటీ) వృద్ధి జరిగిన లక్షణాలు కూడా కనిపిస్తున్నాయని విశ్లేషించారు. 2020 – 21 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక సర్వే వివరాలు కూడా దేశ ఆర్థిక దుస్థితికి అద్దం పడుతుంది. 2020 – 21 ఆర్థిక సంవత్సరం మార్చి – 21తో ముగియనుంది. గత సంవత్సరకాలంగా ఆర్థిక వృద్ధి రేటు మైనస్ 7.7 శాతం నమోదుకాగా, తదనంతరం తిరిగి పుంజుకొని ఇంగ్లీష్ అక్షరం 'వి' రూపంలో పురోగమించడం హర్షదాయకం.

కరోనా విజృంభనకు ఏడాది పూర్తి అయిన వేళ 16 జనవరి 2021 నుండి టీకాలు అందుబాటులోకి రావడం సంతోషదాయకం. ఇండియాలో ప్రస్తుతం రోజుకు 10 నుంచి 20 వేల కేసులు మాత్రమే బయట పడడంతో వైరస్ తీవ్రత తగ్గుతోందని అభిప్రాయ పడుతున్నారు. భారత్‌లో కేసుల సంఖ్య గణనీయంగా తగ్గినా, జాగ్రత్తగా ఉండడం కనీస అవసరమని ప్రజలు మరువరాదు. హద్దుమీరి అలక్ష్యం చేస్తే, రెండవ వేవ్ వైరస్ వ్యాప్తి జరుగవచ్చని హెచ్చరిస్తున్నారు. కరోనా విధించిన క్రమశిక్షణలు పాటిస్తూ, తమ తమ విధులకు హాజరు కావాలని, తద్వారా దేశ ఆర్థికవృద్ధి గాడిలో పడుతుందని గుర్తుంచుకోవాలి. అన్ని రంగాల్లో కరోనా ఆంక్షలు తొలగించడంతో ప్రజాజీవనం పట్టాలు ఎక్కడం, పరిశ్రమలు, నిర్మాణరంగం, సినిమారంగం, విద్యారంగం, సేవారంగం, పలు కంపెనీలు పూర్వ స్థితికి రావడంతో దేశ ఆర్థిక ఆరోగ్యానికి కొత్త ఊపిరి అందించినట్లు అవుతున్నది. కరోనా వ్యాప్తి ఇంకా ఎంత కాలం ఉంటుందో తెలియదు. అయినా విశ్వమహమ్మారి విష కోరలను కత్తిరించి, కరోనా కొమ్ములు వంచి, కోవిడ్–19 బాధలకు స్వస్తి పలికి భారతీయుల ముఖాల్లో సుఖసంతోషాలు నర్తించాలని కోరుకుందాం. భవిష్యత్తులో మనందరం ఒళ్ళు దగ్గర పెట్టుకొని వైరస్‌కు దూరంగా ఉంటూ జీవనయానం కొనసాగిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## సాగుచట్టాలను టీఆర్ఎస్ ముందునుంచే వ్యతిరేకించింది

**విభజన చట్టంలో అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి**

**ఓబీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చర్చ జరగాలి**

**తెలంగాణ అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది**

**టీఆర్ఎస్ ఎంపిలు కెకె,నామాల వెల్లడి**

న్యూఢిల్లీ,జనవరి30(ఆర్ఎన్ఎ): రైతు చట్టాలను టీఆర్ఎస్ వ్యతిరేకించి ందని టీఆర్ఎస్ ఎంపీ కేకే తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సెలక్ట్ కమిటీకి పంపాలని కోరితే కేంద్రం పంపలేదని, రైతుల డిమాండ్లను కేంద్రం విస్మరించవద్దని సూచించారు. ప్రధానితో జరిగిన అఖిలపక్ష భేటీ తరవాత ఆయన మీడియాతో మాట్లాడారు. విభజన చట్టంలో అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఓబీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని కేకే కోరారు. కొత్తగా ఇచ్చే రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, లోపాలను సరిదిద్దాలని సూచించారు.

వరి 26న జరిగిన హింసను సమర్థించి నట్టవుతుందని భావించామని తెలిపారు. కేంద్రం ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని కేకే ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని కేశవరావు అన్నారు. వ్యవసాయ, సాగు, తాగునీటి, విద్యుత్ రంగాల్లో రాష్ట్రం ఎనలేని ప్రగతి సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆదరణ కోల్పోయిన రైతులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు పథకం అమలు చేస్తున్నదని తెలిపారు. వ్యవసాయరంగాన్ని సీఎం కేసీఆర్ ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు.

# తెరుచుకునేందుకు సిద్ధం అవుతున్న స్కూళ్లు

**చురుకుగా శానిటైజేషన్ పనులు**

**ఆదివారం నాటికి పూర్తి చేస్తామన్న అధికారులు**

ఆసిఫాబాద్,జనవరి30(ఆర్ఎన్ఎ): సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండడంతో జిల్లాలో పలు మండలాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఆయా పాఠశాలలను గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వ ర్యంలో శుభ్రపరుస్తున్నారు. తల్లిదండ్రులకు వర్తమానం పంపారు. అధికారులు దగ్గరుండి తమ స్కూళ్లను బాగు చేయించుకునే పనిలో పడ్డారు. పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆసిఫాబాద్ రూరల్ మొత్తం 23 పాఠశాలలున్నాయి. ఇందులో 9,10వ తరగతులకు సంబంధించి 2,503 మంది విద్యార్థులున్నారు. ఆయా పాఠశాలల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శానిటైజేషన్ పనులు చేశారు. కొన్ని చోట్ల మరుగు దొడ్లు మూత్రశాలలు అసంపూర్తిగా ఉన్నాయి. 9వ తరగతికి సంబంధించి 198 మంది, 10వ తరగతిలో 283మంది విద్యార్థుల తల్లిదండ్రులు నిరభ్యంతర లెటర్లను అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో 14 పాఠశాలల్లో 1,245 మంది 9,10 తరగతుల విద్యార్థులున్నారు. షిఫ్టుల వారీగా తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సిర్పూర్(టి) మండలంలో 1190 మంది విద్యార్థులున్నారు. చింతలమానేపల్లి మండలంలో 587 మంది విద్యార్థులు ఉండగా వివిధ పాఠశాలల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు కొనసాగిస్తున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా శుభ్రపరుస్తున్నారు. రెబ్బెన మండలంలో 540 మంది విద్యార్థులు ఉండగా తరగతి గదులను గ్రామ పంచాయతీ సిబ్బంది శానిటైజేషన్ చేస్తున్నారు. బెజ్జూరు మండలంలో 793మంది విద్యా ర్థులుండగా పాఠశాలలను శుభ్రపరిచారు. కొన్ని పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. జడ్పీ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. తిర్యాణి మండలంలో 910 మంది విద్యార్థులు ఉండగా పాఠశాలల్లో శానిటైజేషన్ పనులు పూర్తి స్థాయిలో చేస్తున్నారు. కౌటాల మండలంలో 596 మంది విద్యార్థులు ఉండగా ఇందులో 270 మంది తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించేందుకు ఒప్పుకున్నారు. జైనూరు మండలంలో 5,600 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. పలు పాఠశాలల్లో ఇప్పటికీ మరుగుదొడ్లు, మూత్రశాలల సదుపాయం లేదు. కెరమెరి మండలంలో 433 మంది విద్యార్థులు ఉండగా వివిధ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. వాంకిడి మండలంలో 1,050 మంది విద్యార్థులు ఉండగా పాఠశాలల్లో శానిటైజేషన్ ప్రక్రియ కొనసాగుతోంది.దహెగాం మండలంలో 9,10 తరగతులకు సంబంధించి 622 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా పాఠశాలల్లో శానిటైజేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారం నాటికి పనులు పూర్తి చేసి విద్యార్థుల రాకకు సిద్ధం చేస్తామని ప్రకటించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేత



రాజన్న సిరిసిల్లా, జనవరి 30 (నేటి నిజం ప్రతినిధి): వేములవాడ మండలంరు ద్రవరం గ్రామంలోపుట్ట లక్ష్మీ కు రూ. 24,000 వేలుసీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కుటుంబ సభ్యులకు రుద్రవరం టీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో శనివారం సర్పంచ్ ఉరడి రాంరెడ్డి చేతుల మీదుగా అంద జేశారు .సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూసీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన సామాన్య ప్రజలకు ఊరట నిచ్చేలా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ఉపయోగపడుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుఉరిడీ రాజిరెడ్డి, ఉప సర్పంచ్ తడెం శ్రీనివాస్ .వార్డు సభ్యులు బెజుగం మహేష్.ఎరుగోక్కులా దేవయ్య. సింగిల్ విండో డైరెక్టర్ కట్ట ఎల్లయ్య. మాజీ వర్డ్ సభ్యులు ధనపల్లి రవీందర్ .తడెం లచ్చయ్య.సీనియర్ నాయకులు గుండెల్లి బాలింగం, ఉరడి కిషన్.కుసా మల్లయ్య పేంతల మహేష్ తదితరులు పాల్గొన్నారు.లక్ష్మీ కుటుంబసభ్యులుమాట్లాడుతూ మంజూరు చేసి తమను ఆదుకున్న సీఎం కేసీఆర్ ,ఎమ్మెల్యే రమేష్ బాబుకు అలాగే మంజూరుకు కృషి చేసిన టిఆర్ఎస్ అర్బన్ మండల, గ్రామశాఖ అధ్యక్షులు ఉరిడ్డి ప్రవీణ్ , ఉరి డి రాజిరెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు

# భగవద్గీతతో సమాజానికి ఆధ్యాత్మిక మార్గనిర్దేశం

**–టిటిడి ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి**

తిరుపతి,జనవరి30(ఆర్ఎన్ఎ): ఆధ్యాత్మిక మార్గనిర్దేశం ద్వారా సమాజాన్ని సన్మార్గంలో నడిపే శక్తి భగవద్గీతకు ఉందని టిటిడి ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు. టిటిడి హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో జాతీయ స్థాయి భగవద్గీత శ్లోకాల కంఠస్తం పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు శుక్రవారం మధ్యాహ్నం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు సమాజంలో ఆధ్యాత్మిక కోణంలో ఎలా జీవించాలో భగవద్గీత తెలియజేస్తుందన్నారు. చెడు మీద మంచి విజయం సాధించడమే గీతా సారాంశమని తెలిపారు. చిన్న వయస్సులోనే భగవద్గీత శ్లోకాలను శాస్త్రబద్ధంగా పఠించడం, దానిలోని సందేశం అర్థం చేసుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు.

మన పూర్వీకులు మనకు అందించిన రామాయణ, మహాభారతం, భాగవతం వంటి గ్రంథాలలోని సారాంశాన్ని భావిభారత పౌరులైన పిల్లలకు అర్థమయ్యేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి ఎస్వీబీసీలో ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువతకు గీతాసారం అందాల్సి ఉందని, ఇలాంటి కార్యక్రమాల ద్వారానే అది సాధ్యమవు తుందని తెలిపారు.

గీతాసారాన్ని జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు టిటిడి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అంతకుముందు ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జెఈవో పి.బసంత్‌కుమార్ మాట్లాడుతూ మహాత్మగాంధి చిన్న తనం నుండి భగవద్గీత పఠించేవారని, ఏదైన సమస్య వస్తే, ఆ రోజు ఆ సమస్యకు పరిష్కారం గీతలోని ఆరోజు ఆయన చదివే అధ్యాయంలో ఉండేదన్నారు. భగవద్గీత ఒక మతానికి సంబంధించినది కాదని, భారతదేశంలో ఉద్భవించిన ఈ గ్రంథాన్ని విదేశీయులు సైతం తమ భాషల్లోకి అనువదించుకుని ఫలితాన్ని అనుభవిస్తున్నారని తెలిపారు. జాతీయ స్థాయి భగవద్గీత శ్లోకాల కంఠస్తం పోటీలు నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న జెఈవో శ్రీ పి.బసంత్‌కుమార్‌ను ఈవో అభినందించారు. జిల్లా స్థాయి, జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతులు పొందిన విద్యార్థులకు ఆయన ఆశీస్సులు అందించారు. అనంతరం టిటిడి ఈవో చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ మహుమతులు పొందిన విద్యార్థులకు 20గ్రాములు, 15 గ్రాములు, 10 గ్రాములు స్వామివారి ప్రతిమ ఉన్న వెండి డాలర్లను, టిటిడి ముద్రించిన పుస్తకాలు, లడ్డూ ప్రసాదాలను అందించారు. ఇందులో 6, 7 తరగతుల విభాగంలో విశాఖపట్నంకు చెందిన ఎస్.నాగదిలీప్‌కు ప్రథమ, కర్నూలుకు చెందిన జి.నిత్య శ్రీహర్షిని ద్వితీయ, కృష్ణాజిల్లాకు చెందిన ఎ.లలితాశ్రీ తృతీయ బహుమతులు సాధించారు. అనంతరం 8, 9 తరగతుల విభాగంలో విజయవాడకు చెందిన వి.కోకిల శ్రీ అమృతవల్లి ప్రథమ, ప్రకాశం జిల్లాకు చెందిన ఎన్.ఐశ్వర్య ద్వితీయ, కర్నూలుకు చెందిన వి.సాయి హరిత్ తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు.

# మహాత్ముడి బాటలోనే కెసిఆర్ తెలంగాణ సాధన

**గాంధీకి నివాళి కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి**

వరంగల్,జనవరి30(ఆర్ఎన్ఎ): జాతిపిత గాంధీజీ అనుసరించిన అహింస, సత్యాగ్రహం ద్వారానే లోకకల్యాణం



సాధ్యమవుతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మహాత్ముని జీవితం దేశానికే కాకుండా మొత్తం ప్రపంచానికే ఆదర్శమని, స్ఫూర్తిదాయకమని చెప్పారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా హన్మకొండలోని తన క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సత్యాగ్రహం, అహింస ద్వారా దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన మహాత్ముని బాటలోనే.. సీఎం కేసీఆర్ స్వరాష్ట్రాన్ని సాధించి బంగారు తెలంగాణ గా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆవిష్కరిస్తూ ముఖ్యమంత్రి దేశానికి ఆదర్శం గా నిలిచారని చెప్పారు. రాష్ట్రంలో పల్లె ప్రగతి కార్యక్రమం నిరంతరంగా కొనసా గుతున్నదని, గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాలకు ట్రాక్టర్లను సమకూర్చామని వెల్లడించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం రూ.308 కోట్లు విడుదల చేస్తున్నదని తెలిపారు. అతి చిన్న గ్రామాలకు కూడా రూ.5 లక్షలకు తగ్గకుండా అభివృద్ధి నిధులు అందుతున్నాయని చెప్పారు.

# గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

**మహాత్మాగాంధీ కి ఘన నివాళులు అర్పించి పోలీసులు.**



రాజన్న సిరిసిల్లా, జనవరి 30 (నేటినిజం ప్రతినిధి):జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకుని భారత స్వతంత్ర పోరాటంలో ప్రాణాలర్పించిన మహనీయుల అమరవీరులు త్యాగాలను స్మరిస్తూ వారి ఆత్మశాంతి కోసం శనివారం ఉదయం 11:00 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్వాతంత్ర్య కొరకు త్యాగాలు చేసిన అమర వీరులకు మనం ఎల్లవేళలా ఋణపడి ఉండాలని, ప్రతి ఒక్కరూ శ్రమించడమూ, సేవా దృక్పథమూ, ఆధ్యాత్మిక దృక్కోణమూ మన జీవితంలో ప్రధానాంశాలు తెలిపారు. గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

## అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

**ఇద్దరు అక్కడిక్కడే మృతి**

నాగర్‌కర్నూలు,జనవరి30(ఆర్ఎన్ఎ): శ్రీశైలం–హైదరాబాద్ రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడటంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమపెంట వద్ద శనివారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరిగింది. మృతులను హైదరాబాద్‌కు చెందిన చంద్రశేఖర్, సరస్వతిగా పోలీసులు గుర్తించారు. వీరంతా దైవదర్శనానికి శ్రీశైలంవెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రేపు రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో

హైదరాబాద్, జనవరి 30: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం కానుంది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగనుంది. కాగా హైదరాబాద్‌లో మాత్రం ఫిబ్రవరి 3 వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. రాష్ట్రంలో మొత్తం 38,31,907 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నట్లుగా సమాచారం. 23,331 కేంద్రాల ద్వారా పోలియో చుక్కల పంపిణీ కొనసాగనుంది. పోలియో ఫ్రీ దేశంగా భారత్ ఐదేళ్లు పూర్తి చేసుకుంది.

# రేవంత్ రెడ్డి దీక్షకు మద్దతుగా ఆర్మూరుకు తరలిన కాంగ్రెస్ నాయకులు..



రాజన్న సిరిసిల్లా, జనవరి 30 (నేటినిజం ప్రతినిధి):పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని, పసుపు రైతులకు మద్దతు గా ఆర్మూర్ పట్టణంలో శనివారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి చేపట్టిన రాజీవ్ రైతు భరోసా దీక్షకు మద్దతుగా చందుర్తి మండల కాంగ్రెస్ నాయకులు శనివారం తరలివెళ్లారు, చందుర్తి జడ్పిటిసి నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి ఆధ్వర్యంలో ఎంపిటిసిలు మ్యాకల మ్యాకల గణేష్, పులిరేణుక సత్యం,మర్రిగడ్డ సర్పంచ్ నేతికుంట జలపతి, నాయకులు గొట్టే ప్రభాకర్,గసికంటి ప్రభాకర్,మర్రి మల్లేశం, ధర్మపురి శ్రీనివాస్, దారం చంద్రం, గంటమల్లేశం తదితరులు ఆర్మూర్ కు తరలవెళ్లి రేవంత్ రెడ్డికి సంఘీభావం ప్రకటించారు, గత ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామనిహామి ఇచ్చారని నేటికీ ఆ హామీ అమలు కాలేదని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని చందుర్తి మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు,

# సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి హరీష్

**ఉద్యోగుల గైర్హాజరీపై ఆగ్రహం**

సంగారెడ్డి,జనవరి30 (నేటినిజం ప్రతినిధి):: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయాన్ని మంత్రి హరీశ్ రావు



ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లలో కలియ తిరిగారు. ఈ సందర్భంగా చాలా కుర్చీలు ఖాళీగా ఉండటాన్ని గమనించిన మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఉదయం 10.30 గంటలు దాటినప్పటికీ చాలా మంది ఉద్యోగులు విధులకు ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం సంగారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. జెడ్పీ కార్యాలయ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మంజుల జైపాల్ రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన

**శబ్ద కాలుష్యం చేస్తున్న 1,134 వాహనాలను సీజ్**

హైదరాబాద్,జనవరి30(ఆర్ఎన్ఎ): శబ్ద కాలుష్యం చేస్తున్న 1,134 వాహనాలను సీజ్ చేసినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ అనిల్‌కుమార్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని కేబీఆర్ పార్కు ఆవరణలో ట్రాఫిక్ నియమాలు, జరిమానాలపైన అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ అనిల్‌కుమార్, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ చౌహాన్, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 65 డెసిబుల్స్ కన్నా ఎక్కువ శబ్దం వచ్చే వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో భాగంగానే ఒక్క జనవరి మాసంలోనే శబ్దకాలుష్యం చేస్తున్న 1,134 వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

## అగ్రరాజ్యం అమెరికాలో దారుణం

**–మహాత్ముడి విగ్రహానికి అపచారం**




కాలిఫోర్నియా,జనవరి30(ఆర్ఎన్ఎ): అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి మహాత్మ గాంధీ విగ్రహాన్ని కొందరు గుర్తు తెలియని దుండగలు ధ్వంసం చేశారు. కాలిఫోర్నియాలోని ఓ పార్కులో ఈ నెల 27న ఈ ఘటన చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై భారతీయ అమెరికన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్వేషపూరితమైన ఈ ఘటనపై దర్యాప్తు చేసి, నిందితులను శిక్షించాలని ఎన్నారైలు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కాలిఫోర్నియాలోని డేవిస్ నగరంలోని సెంట్రల్ పార్కులో ఈ ఘటన జరిగింది. కాంస్యంతో చేసిన ఆరు అడుగుల ఎత్తు, 294 కిలోల బరువు గల గాంధీ విగ్రహాన్ని దుండగులు బేస్ నుంచి పడగొట్టేశారు. అనంతరం అక్కడి నుంచి ఈడ్చుకుని వచ్చి కొద్ది దూరంలో పడేసి వెళ్లిపోయారు. దీంతో విగ్రహం పూర్తిగా ధ్వంసమైంది. బుధవారం ఉదయం(27వ తేదీన) ఓ పార్క్ ఉద్యోగి విగ్రహం కిందిపడి ఉండడం చూసి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. డేవిస్ సిటీ కౌన్సిల్ సభ్యుడు లూకాస్ ఫ్రీరిచ్స్ మాట్లాడుతూ ధ్వంసమైన విగ్రహాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడం జరిగిందని, దీనికి కారణమైన వారిని వదిలిపెట్టబోమని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న డేవిడ్ నగర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 'డేవిస్‌లోని కొంత భాగానికి ఈ విగ్రహం సాంస్కృతిక చిహ్నంగా ఉంది. మేము ఈ ఘటనను చాలా తీవ్రంగా తీసుకుంటున్నాము' అని డేవిస్ పోలీసు శాఖ డిప్యూటీ చీఫ్ పాల్ డోరోషోవ్ అన్నారు. ఈ సంఘటనపై భారతీయ–అమెరికన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితిలో దీనికి కారణమైన వారిని వదిలిపెట్టొదని, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్వేషాలు రెచ్చగొట్టే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎన్నారైలు కోరారు.

## రేషన్ బియ్యానికి ఆధార్ లింక్–భారీగా బారులు తీరిన జనం

వికారాబాద్,జనవరి30(ఆర్ఎన్ఎ): జిల్లా పరిగిలో మీ సేవ కేంద్రాల దగ్గర రేషన్ వినియోగదారులు బారులు తీరారు.రేషన్ బియ్యం తీసుకోవాలంటే ఇక నుంచి ఆధార్ కు ఫోన్ లింక్ ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. మండలానికి ఒకటి, పరిగి లాంటి పట్టణాల్లో మూడు కేంద్రాలకు ఆధార్ కు ఫోన్ లింకు చేసేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో రేషన్ వినియో గదారులు మీ సేవ కేంద్రాలకు క్యూకట్టారు. అయితే ఫీజు ఎంత ఇవ్వాలని అధికారులు చెప్పడం లేదు. కొందరు 45రూపాయలు వసూల్ చేస్తే..మరికొందరు 100 నుంచి 150 రూపాయల వరకు తీసుకుంటున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కేంద్రాలకు వెళ్లకుండా మొబైల్ ఫోన్ లోనూ ఆధార్ తో సెల్ ఫోన్ లింక్ చేసుకోవచ్చని నిర్వహకులు చెబుతున్నారు.

# బీజేపీలో చేరేందుకు ఢిల్లీకి టీఎంసీ మాజీ నేతలు

న్యూఢిల్లీ, జనవరి 30: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జి నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఇటీవల పలువురు నేతలు రాజీనామాలు చేశారు. తాజాగా వారంతా కలిసి బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం వారు బీజేపీ కీలక నేతలు ముకుల్ రాయ్, కైలాస్ విజయవర్గీయతో కలిసి ఢిల్లీకి చేరుకున్నారు. బీజేపీలో నేతలతో ఢిల్లీకి వెళ్లిన వారిలో బెంగాల్ రాష్ట్ర మాజీ మంత్రి రాజీవ్ బెనర్జి, వైశాలి దాల్మియా, ప్రబీర్ గోషల్, రతిన్ చక్రవర్తి ఉన్నారు. వీరంతా ఢిల్లీలో బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.